నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 23 ఆగస్టు 2024 | KHAMMAM


ఖమ్మం: మంచుకొండ రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

రుణమాఫీపై... బీఆర్ఎస్ పోరుబాట్లు

రైతులతో కలిసి రోడ్డెక్కిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఉమ్మడి జిల్లా అన్నదాతలకు అండగా నిలిచిన 'బీఆర్ఎస్'

ఆంక్షల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే..

చివరి రైతు వరకూ రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలి

కాంగ్రెస్‌వి 420 హామీలు.. ఆరు గ్యారెంటీల్లో అన్నీ కోతలే..

మంచుకొండ 'రైతు ధర్నా'లో మాజీ మంత్రి అజయ్‌కుమార్

కర్షకుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం: రేగా కాంతారావు

రైతు రుణమాఫీ కోసం బీఆర్ఎస్ పోరుబాట పట్టింది. రేవంత్ సర్కార్ మెడలు వంచి రైతులకు న్యాయం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఆంక్షల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. రుణమాఫీ జరగని రాష్ట్ర రైతులకు బాసటగా నిలవాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులన్నీ కదం తొక్కాయి. రైతులతో కలిసి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఖమ్మం, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో జరిగిన రైతు ధర్నాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. 'సీఎం డౌన్ డౌన్.. రైతులకు రుణమాఫీ చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి. .రైతులను దగా చేసిన రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్.. రైతులకు మాయమాటలు చెప్పి మోసగించిన సీఎం రాజీనామా చేయాలి..' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మణుగూరులో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. రుణమాఫీ పేరిట కర్షకులకు కాంగ్రెస్ చేసిన మోసంపై కడిగిపారేశారు.

రుణమాఫీ చేసే వరకూ పోరాటం: అజయ్

ఖమ్మం ధర్నాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ అమలుచేయాలని, అందులో ప్రధానమైన రుణమాఫీని చివరి రైతు వరకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేసే వరకూ బీఆర్ఎస్ కచ్చితంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ఉద్యమ నేత కేసీఆర్‌కుగానీ, బీఆర్ఎస్‌కుగానీ పోరాడడం కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. విక్రమార్కుడు సినిమాలో సగం గుండు కొట్టి.. మిగిలిన గుండుకు రూ.వెయ్యి అడిగిన చందంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసగించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేంతవరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌వి 420 హామీలని, ఆరు గ్యారెంటీల్లో అన్నీ కోతలేనని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, అజ్మీరా వీరూనాయక్, గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, భుక్యా లక్ష్మణ్‌నాయక్, నాగండ్ల కోటి, దేవభక్తుని కిశోర్‌బాబు, చిలుమూరు కోటేశ్వరరావు, హెచ్ ప్రసాద్, దండా జ్యోతిరెడ్డి, తొలుపునూరి దానయ్య, దొంతు సత్యనారాయణ, వాంకుడోతు సురేశ్, మేడబోయిన పెద్ద మల్లేశం, జాతోతు సూర్యం, కాంపాటి రవి, శీలంశెట్టి వీరభద్రం, తంగెళ్లపల్లి శ్రీను, తీగల సతీశ్‌గౌడ్, మిరియాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్షకులతో కాంగ్రెస్ చెలగాటం: రేగా

మణుగూరు టౌన్, ఆగస్టు 22: కర్షకుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటమాడుతోందని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో నోటికొచ్చింది చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రైతులను నిలువునా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మణుగూరులో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. తరువాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరమంటూ అధికారంలోకి వచ్చిన కొత్తలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. క్యాబినెట్‌లో మాత్రం కేవలం రూ.31 వేల కోట్లకే అనుమతినిచ్చారని విమర్శించారు. ఇక బడ్జెటలో రూ.26 వేల కోట్లు కేటాయించి ఇప్పుడు కేవలం 17 వేల కోట్లే ఖర్చు చేశారని దుయ్యబట్టారు. కానీ రూ.7,500 కోట్లతో రుణమాఫీ చేసి రైతులను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రతి వందమంది రైతుల్లో పది మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని అన్నారు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముత్యం బాబు, ముద్దంగుల కృష్ణ, ప్రభుదాస్, మడి వీరన్న, చెన్నకేశవరావు, రవి, జావీద్‌పాషా, గుర్రం సృజన్, బోశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి: ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఇల్లెందు రూరల్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఖమ్మం రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

మణుగూరు టౌన్: తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న రేగా కాంతారావు, బీఆర్ఎస్ నాయకులు

తిరుమలయపాలెం: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అశ్వారావుపేట టౌన్: రుణమాఫీ చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

వైరా టౌన్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ఎర్రుపాలెం: ధర్నా చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ: ఏపీజీవీబీ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు,రైతులు

కొత్తగూడెం: మాజీ ఎమ్మెల్యే వనమా ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

'తెలంగాణ తల్లి'.. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్

రాష్ట్ర సచివాలయంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరాల్సిందే..

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకంలో మాజీ మంత్రి అజయ్

తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం, ఆగస్టు 22: 'తెలంగాణ తల్లి.. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్' అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సచివాలయం ఎదుట ఆ పార్టీ నేత విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని చూస్తుండడం ఆక్షేపణీయమని అన్నారు. రైతు ధర్నా కోసం మంచుకొండ గ్రామానికి వెళ్లేందుకు ముందుగా ఖమ్మం ఎన్‌టీఆర్ సర్కిల్లోని తెలంగాణ తల్లి విగ్రహానికి గురువారం ఆయన క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయం ప్రాంగణంలో ఉన్న తెలుగుతల్లి విగ్రహాన్ని రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించి ఆ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు ఆలోచన చేసిందని అన్నారు. తాము తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలనుకున్న ఆ ప్రదేశంలో నేటి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకుడి విగ్రహాన్ని పెట్టాలని అనుకుంటోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌గా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటుచేయకుంటే రాష్ట్ర ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'నూతన ఆర్‌వోఆర్'కు సలహాలు, సూచనలివ్వండి

ముసాయిదా వర్క్‌షాపులో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఆర్‌వోఆర్ చట్టం రూపకల్పనకు సలహాలు, అభిప్రాయాలు సేకరిస్తున్న కలెక్టర్

మామిళ్లగూడెం, ఆగస్టు 22: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలను అందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. 'నూతన రెవెన్యూ చట్టం-2024' ముసాయిదాపై రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, నిపుణులతో కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజలను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వర్క్‌షాపును నిర్వహించినట్లు చెప్పారు. భూ రికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాల బాధ్యులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రస్తుత, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు తదితరులు తమ సూచనలు అందించాలని కోరారు. డీఆర్‌వో రాజేశ్వరి, ఆర్‌డీవోలు గణేశ్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణ మాఫీ అవుతుంది

- రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నాం
- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్
- 'చింతల్ తండా' రైతుల రుణమాఫీపై ఆరా..
- 'నమస్తే' కథనానికి స్పందన

చింతల్‌తండాలో మొక్క నాటుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/జూలూరుపాడు, ఆగస్టు 22: అర్హులందరికీ రుణ మాఫీ అవుతుందని, మాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నామని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనలో భాగంగా జూలూరుపాడు మండలం చింతల్‌తండా గ్రామానికి గురువారం ఆయన వెళ్లారు. అక్కడ మునగ మొక్కలను నాటి రైతులతో చర్చించారు. అయితే చింతల్ తండా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదంటూ 'నమస్తే తెలంగాణ' ఇటీవల ప్రచురించిన కథనంపై స్పందించిన ఆయన.. ఆ అంశంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీపై ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ ఉండదని, అర్హులకు రుణమాఫీ అవుతుందని, గ్రామంలో అర్హుల పేర్లను పరిశీలిస్తానని అన్నారు. రుణమాఫీ రాని వారి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్నామని, ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు చెప్పాలని అన్నారు. అలాగే, గతంలో రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణం ఇవ్వడం లేదని కొందరు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

మునగ సాగు రైతులకు కలెక్టర్ అభినందన

జూలూరుపాడు మండలం చింతల్‌తండా, బేతాళపాడు, రేగళ్లతండా, మాచినేనిపేట తండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. 'నాటుదాం ఒక చెట్టు.. అమ్మ కోసం' కార్యక్రమంలో భాగంగా చింతల్‌తండాలో మునగ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అక్కడ సాగవుతున్న మునగ పంటను పరిశీలించి రైతులను అభినందించారు. కొమ్ముగూడెంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలను పరిశీలించారు. వెంటనే ఆ భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈవో విద్యాచందన, ఏపీడీ రవి, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరాం, ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.